

# ఎందుకే నీకింత తొందరా...

## - బలభద్రపాత్రుని రమణి



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
బహుమతి పొందిన ఉత్తమ నవల
(గత సంచిక తరువాయి)

**"నేనైతే భరించను.** వదిలేస్తాను" అన్నాను.

"అంతే! సో సింపుల్. ఎటొచ్చీ పెళ్ళయితే తలనెప్పి. లాయర్లూ, కోర్టులూ.. లివిన్‌లో తలనెప్పి వుండదు" అన్నాడు.

"నువ్వు అలా ఇంకో అమ్మాయితో నన్ను వదిలి వెళ్ళిపోతావు అన్నట్లే మాట్లాడేసావ్" అన్నాను.

"లుక్ నాకు అలాంట్ థాట్స్ లేవు. రేపు నీకు కాన్సర్ వచ్చి ఏమైనా అయిపోతే? అంటే, నా దగ్గర జవాబు లేదు. ఇదీ అలాంటి జబ్బే" అన్నాడు.

"పెద్దవాళ్ళకి ఇలాంటి లాజిక్స్ చెపితే అర్థం కాదు, తొక్క తీస్తారు" అన్నాను.

"అయితే పెళ్ళి చేసుకోవాలి అంటావ్. లేకపోతే నాతో ఇంటికి రావా? నన్ను ముట్టుకోనివ్వవా?" అడిగాడు.

నేను కాఫీ కప్పు గుండ్రంగా తిప్పుతూ చెప్పాను "నా శీలం పోయింది. అని నేను పాత సినిమాల్లోలా బాధ పడటంలేదు. అలాగని నేను నువ్వు కోరినప్పుడల్లా నీ కోరిక తీర్చలేను. నాలో ఏ మూలో కొంత భావుకత్వం కోరుకునే స్త్రీ వుంది. చందమామా, మల్లెపూలూ, మంచి గంధం, ప్రియుడి చల్లని మాటా ఇవన్నీ నా మనసు కోరుకుంటోందేమో. అవన్నీ ప్రేమకి ఉత్ప్రేరకాలు. నీ హోదా.. నీ పలుకుబడీ... డబ్బూ ఇవన్నీ పెళ్ళికి ప్రేరేపకాలు" అన్నాను.

ద్వారక నవ్వాడు "ఒక్కసారి ఒప్పుకున్నాక మళ్ళీ ఒప్పుకోడానికి బెట్టు దేనికీ? ఒకసారైనా వందసార్లు అయినా ఒకటేగా" అని సగటు మగాడిలా మాట్లాడను. నీ ఇష్టం. కానీ నీకు కావాలనిపిస్తే మొహమాట పడకు" అన్నాడు.

"హనీష్ ఏం చెప్పాడో విన్నావుగా? ఈ సంవత్సరం నాకు ఇంట్లో పెళ్ళి చెయ్యాలనుకుంటున్నారు. వాళ్ళకి నేను ఏం జవాబు ఇవ్వాలి" అన్నాను.

"నీ ఇష్టం. నాకైతే బిజినెస్‌లో సెటిల్ అవడానికి ఇంకో రెండేళ్ళు కనీసం టైం పడుతుంది. పెళ్ళి అనేది ప్రతిబంధకం. నువ్వు నాతో కలిసి వుంటానంటే నీకోసం ఇండియాలో కానీ ఇక్కడకానీ, నాకు అభ్యంతరం లేదు. కావలసింది నామీద నీకు నమ్మకం" అన్నాడు.

గవర్నమెంట్‌కీ, చట్టానికీ, కన్నవాళ్ళకీ ఓ 'నమ్మకం మీద చాలా నమ్మకం తక్కువ' అందుకే పరి అల్విన్‌ని పెళ్ళి చేసుకుంది. ధీరజ్ కుమిలిపోతున్నాడు. ఎప్పటికైనా పరిమళ నాదే అన్న నమ్మకం అతనికి ఆనందాన్నివ్వడంలేదు" మీ అమ్మాయికి పెళ్ళి అయిందా?" అంటే ధైర్యంగా మామయ్యా, అత్తయ్యా లోకానికి జవాబు చెప్పలేరు. పెళ్ళివల్ల చట్టం వాళ్ళ మెడలకి ఉరిలా కనిపిస్తోంది

మేం పెళ్ళి చేసుకోకుండా, కలిసి వుండడం వల్ల అమ్మా నాన్నలకి అదే చట్టం మెడకి ఉరిలా బిగుసుకున్నట్లు వుంటుంది.

చట్టం.. నమ్మకం రెండూ బొమ్మా బొరుసులు. ఏది పడితే అదృష్టమో కాసే పందెం బట్టి వుంటుంది. జీవితంతో ఇంత జూదాం ఆడడం అవసరమా?

"కాఫీ చల్లారిపోయింది. వదిలెయ్. ఇంకొకటి తెస్తాను" అన్నాడు ద్వారక.

"డబ్బులు పెట్టి కొన్నాం. ఎలా వదిలేస్తానూ?" అన్నాను.

"దానిమీద ఇన్‌వెస్ట్ చేసింది తక్కువ. పైగా దాని క్వాలిటీ వేలిడిటీ పిరేడ్ అయిపోయింది" అన్నాడు.

మనుషులకి కూడాఇది వర్తిస్తుందా? వేలిడిటీ పిరేడ్. నాకు ఆలోచనలు సుడి తిరుగుతున్నాయి.

"అమ్మా నాన్నలు చూసిన ఏ గోపాలాన్నో, రామనాధాన్నో చేసుకుంటే ఇవన్నీ వుండవు కదే" అని యాషికా అన్న మాటలు గుర్తొచ్చాయి.

ఆ కట్టుకున్నవాడు నిత్యం నన్ను అనుమానాలతో వేధిస్తే, కన్నవాళ్ళనుండి డబ్బు తీసుకురమ్మని పీడిస్తే, రాత్రికాగానే శాడిస్టులా బ్లేడ్‌తో కోస్తేనో అప్పుడు కోర్టు విడాకులకి అనుమతించకపోతే ఇద్దరు పిల్లలు పుట్టేసి, నా కాళ్ళకి ప్రతిబంధకాలైతే 'అమ్మా ఆకలీ అనే వాళ్ళ నోళ్ళకి అన్నం అందించడానికి, అతనితో రాజీ పడాల్సి వస్తే మా అమ్మ ఏడుస్తూ టి.వీలో చూసిన 'మనుషులు మారాలీ', 'భార్యాబిడ్డలూ' లాంటి సినిమాలు గుర్తొచ్చాయి.

మళ్ళీ అంతలోనే పెళ్ళికాకుండా పిల్లాడు పుడితే నువ్వే పోషించుకోవాలి కదా! పిల్లలు లేకుండా కలకాలం వుంటావా?" ఆడది కోరుకునే వరాలు రెండే రెండు. చల్లని సంసారం, చక్కని సంతానం" అన్న పాట గుర్తొచ్చింది.

'చల్లని సంసారం అంటే ఏ.సి వుండాలనా ఇంట్లో?"

"ఏయ్ ఎక్కడికి వెళ్ళావ్?" నా మొహం ముందు చిటికెలు వేసాడు ద్వారక.

"ఇండియా వెళ్ళొచ్చా. అమ్మ చూసే బ్లాక్ అండ్ వైట్ సినిమాలు గుర్తొచ్చాయి" అన్నాను.

"ముత్తైదువుగా బ్రతుకే ధన్యం" అని ఎంత బార్బేరియన్ థాట్స్? భర్త పోయిన స్త్రీలు ఎంత నరకం అనుభవిస్తారు ఈ పాటలు వినీ అనుకున్నాను.

కానీ ఈ పాత ఆలోచనలూ కట్టుబాట్లూ వదిలెయ్యమంటే నేను వింటున్నానా? మళ్ళీ అదే తాళి బొట్టూ మొహాన పసుపూ బొట్టూ, బాలింత సారె.. మానేస్తే ఎంతో వెలితి అనుకుంటూ

"పద" అన్నాను ద్వారకతో

"మూడ్ మారిందా?" అడిగాడు.

"లేదు. మా ఇంటికి" అన్నాను.

కార్లో కూర్చున్నాకా చెప్పాడు" నీ మనసు నేను చదవగలిగితే ఎంత బావుండూ? డాక్టర్లు మన గుండె ఈకేజీ చదివినట్లూ?"

"ఆ పిచ్చ గీతలన్నీ మెదడులోంచి నోళ్ళు వచ్చి మాట్లాడ్తే.. విని చచ్చిపోతాం" అన్నాను.అతనూ నవాడు.

ఈ కాసేపట్లో 'మనుషులు మారాలి ' సినిమా ముత్తైదువలా బ్రతుకే ధన్యం పాటా .. బాలింత సారే, ఇవన్నీ నాకళ్ళ ముందు తిరిగాయి. వీటి మధ్యలో శాడిస్ట్‌లా మారి రాత్రి కాగానే నన్ను బ్లేడ్‌తో కోసే మొగుడు కూడా! ఇవన్నీ ద్వారకతో పంచుకుంటే.. అర్జెంటుగా నన్ను మెంటల్ ఎస్సైలంలో పారేస్తాడు.

ఇంటి దగ్గర కారు దిగే ముందు చెప్పాడు ద్వారక.

"నీ ప్రతి ఆలోచననీ నాతో పంచుకోవచ్చు. అలాంటి స్నేహితుడుని నేను. నీ ఎక్స్ బాయ్‌ఫ్రెండ్ నాకన్నా సెక్స్‌లో పర్‌ఫెక్ట్ అన్న విషయంతో సహా!" అన్నాడు.

"డియర్ ద్వారకా. ఆ అనుభవం నీతోనే నాకు మొదటిసారి నా పాతివ్రత్యాన్ని ప్రూవ్ చేసుకోడానికి చెప్పడంలేదు. ఆ వైపుకి నువ్వు ఆలోచించకుండా వుండడానికి చెప్తున్నాను" అన్నాను.

"రుషీ! ఐ లవ్‌యూ" అన్నాడు ద్వారక.

"ఎందుకో ఈ మాట థ్రిల్ ఇవ్వడం లేదు.. చిన్నప్పుడు ఎదురింటి నందూగాడు చీప్ గ్రీటింగ్ కార్డ్ మీద హార్ట్ సింబల్ వేసి, ఐ లవ్ యూ " రుచీంద్రమనీ" అని రాసినప్పుడు కూడా ఇంతకన్నా థ్రిల్ పొందాను" అని నవ్వాను.

"నీతో లైట్‌గా మాట్లాడితే వీడికి సీరియస్‌నెస్ లేదా అన్నట్లు చూస్తావ్. సీరియస్‌గా మాట్లాడితే భయపడిపోతావ్. రొటీన్‌గా మాట్లాడితే ఆట పట్టిస్తావ్. ఎలా మాట్లాడినా కష్టమే రుచీంద్రమనీ" అన్నాడు.

"తిండీ, బట్టా, గూడూ కాకుండా బేర్ మినిమం ఎసెన్షియల్స్ బ్యూటీషియన్, ఫిజికల్ ట్రెయినర్ అని ఇప్పుడే తెలిసింది" అన్నాను.

"ఏం మాట్లాడినా మొత్తానికి నీతో మాట్లాడితే బావుంటుంది. ఆర్గాజం అయినట్లు" అన్నాడు.

"నీకు సిగ్గులేదు" అని వచ్చేసాను.

ఈవినింగ్ అంతా కలగని థ్రిల్.. ఆ చివరి మాటవల్ల కలిగింది. నీ రూపం, నీతో సెక్స్ కన్నా నీ సామీప్యం నీతో మాట్లాడడం వల్ల ఆనందం కలుగుతుంది అనే మాట ఎంతైనా థ్రిల్ ఇస్తుంది. నాలో భావకురాలుంది. యాషిక ఎప్పుడూ చెప్తుంది. నవలలు రాయి. చేతన్ భగత్ అమ్మా మొగుడిలా రాస్తావని. అదే ప్రోబ్లం అతనిలా రాస్తే చాలు. అమ్మా మొగుడులా వద్దు.

పరిమళ రాత్రి నా గదికి వచ్చింది. పడుకోబోతున్నదాన్ని లేచి కూర్చున్నాను. "ధీరజ్‌కి అంతా చెప్పేశాను రుషీ" అంది.

"వెరీ గుడ్ అతను అర్ధం చేసుకున్నాడా? చేసుకుంటాడులే.. నువ్వంటే అతనికి ప్రాణం" అన్నాను.

"లేదు రుషీ! ఇంత పెద్ద నిర్ణయం నన్ను అడగకుండా ఒక్కదానివే తీసుకున్నావంటే నిన్ను నమ్మలేను. మా మేనమామ కూతురు మందాకినిని చేసుకుంటే కనీసం ఇంతింత సాహసాలు చెయ్యలేదు అన్నాడు" అంది.

"ఛ! నీమీద కోపంతో అబద్దాలు చెప్తున్నాడు. నీకోసం వెయిట్ చేస్తాడు" అన్నాను.

"అమ్మకి వాళ్ళ అమ్మ ఫోన్ చేసిందట. ధీరజ్ మేనరికం ఖాయం చెయ్యమంటున్నాడు అని" అని వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తూ "ఏదైతే జరుగుతుందని భయపడి ఇన్నాళ్ళూ ఈ విషయం దాచానో అదే జరిగింది. ఐ లాస్ట్ హిమ్. నేను ధీరజ్‌ని పోగొట్టుకున్నాను" అని ఏడ్చింది.

అది ఏడుస్తూ వుంటే చూస్తూ కూర్చున్నాను. బహుశా దాని తల్లీ తండ్రీ కూడా "ఈ ఏడుపు అంతలేసి నిర్ణయాలు తీసుకున్నప్పుడు వుండాల్సింది. కనీ పెంచి నీమీద ఇంత ఇన్‌వెస్ట్ చేసిన తల్లితండ్రులూ నీ తోడిదే లోకం అని ప్రేమించి నోకోసం ఎదురు చూస్తున్న ధీరజ్.. వీళ్ళు ఎవరూ గుర్తు రాలేదా?" అని తిట్టి వుంటారు. నేనూ అదే పని చేస్తే, మోడ్రన్ ఉమెన్ అని చెప్పుకోడానికి నాకేం అర్హత వుంటుంది? "ఇట్స్ మై లైఫ్.. మీరెవరు? అన్న పరిమళ.. ప్రేమించినవాడు తృణీకరించేసరికి అబలలా ఏడుస్తోంది.

"నేను కాల్ చేసి మాట్లాడి నచ్చ చెపుతా" అన్నాను.

"నా ఫోన్  అమ్మా నాన్నల నెంబర్లు కూడా బ్లాక్ చేసాడు" అంది వెక్కిళ్ళు పెడ్తుతూ.

"ఇదంతా కొత్తల్లో పుండు పచ్చిగా వున్నప్పుడు తర్వాత మాములు అయిపోయి నిన్ను వదులుకోలేక మాట్లాడ్తాడు. నువ్వు వేరే అబ్బాయితో వెళ్ళి పోలేదు కదా! అతనికి ఈ కోపం నిలవదులే" అన్నాను.

"పట్టుదల మనిషి మందాకిని పెళ్ళిచేసేసుకుంటాడేమో" అంది.

"నీతో ఇంత ప్రేమ భాగోతం నడిపి, ఇలా నువ్వు ఒక్క ఏడాది ఆగు అంటే మందాకిని చేసేసుకుంటాడా? ఇంత చంచలుడినా నువ్వు ప్రేమించినదీ?" అన్నాను.

"ఐ అఫెండెడ్ హిమ్. నేను చాలామందిని బాధపెట్టా నా పనివల్ల" అంది.

"ఓ స్నేహితురాలినీ, ఆమె కుటుంబాన్నీ కాపడాలన్న తపనలో నువ్వీ పని చేసావ్. చెయ్యకూడదు కానీ చేసావ్. ఇప్పుడు బాధ పడడం కన్నా, జరగవలసింది ఆలోచించు. నేను వెళ్ళి మాట్లాడనా ధీరజ్‌తో?" అన్నాను.

"అతను ఇండియా వెళ్ళిపోయాడు" అంది.

"ఓ మైగాడ్! నీకన్నా ఫాస్ట్‌గా నిర్ణయాలు తీసుకుంటాడే? మా వసుంధర ఎప్పుడూ ఫాస్ట్‌ఫుడ్ జెనరేషన్ అన్నీ ఫాస్ట్‌గా చేసేసి ఏడుస్తూ కూర్చుంటారు. అంటూ వుంటుంది" అన్నాను.

"హూ! వాళ్ళకి మనం ఫాస్ట్ అయితే అమ్మమ్మకి వాళు ఫాస్ట్ అనిపించి వుంటారు" అంది పరి.

"నీకు కోపం రాదంటే ఒక్క మాట చెప్తాను" అన్నాను.

"చెప్పు" అంది.

"నువ్వు ఇండియా వచ్చి ధీరజ్‌కి ముఖతహా ప్రోబ్లం చెప్పి కన్విన్స్ చెయ్యి. ఫోన్లూ, మెసేజ్‌లూ ఒక్కోసారి కన్విన్స్ చెయ్యలేవు. ఇంకా కాంప్లికేటెడ్ చేస్తాయి. ఒక చూపు, ఒక స్పర్శ ఎంతో కమ్యునికేట్ చేస్తుంది తెలుసా?" అన్నాను.

పరి కళ్ళు తుడుచుకుని "నువ్వు చాలా మెచ్యూర్డ్. ఎంతో బాగా మాట్లాడగలవు. నిన్ను చేసుకోబోయేవాడు అదృష్టవంతుడు" అంది.

ద్వారక గుర్తొచ్చాడు.

"పిండి ఆరబోసినట్లున్న వెన్నెల్లో, మనిద్దరం పక్క పక్కన పడుకుని, చంద్రుడ్ని చూడాలి" అంటే,

"మరి పిండి అంటుకోదా బట్టలకి" అంటాడు అని అనుకోగానే నవ్వొచ్చింది.

"ఎందుకు నవ్వూ? నీ బోయ్ ఫ్రెండ్ గుర్తొచ్చాడు కదూ? హీ ఈజ్ టూ స్మార్ట్" అంది.

ద్వారక చాలా బాగుంటాడు. కానీ అతని తర్కమే. భయం వేస్తుంది. భర్తగా భరించగలనా? అనిపిస్తూ వుంటుంది. ఫ్రెండ్‌గా భరించొచ్చేమో. ఓసారి ప్రయత్నించి చూస్తే ఏం పోతుందీ? చూడాలి.

నానమ్మ ఫోన్ చేసి అత్తయ్యతో మాట్లాడాక "రుషి ఏం చేస్తోందీ?" అని అడిగినట్లుంది. అత్తయ్య "ఇదిగో నీ ముద్దుల మనవరాలు" అని ఫోన్ నా చేతికిచ్చింది.

"రుషీ! నువ్వు లేకపోతే ఇల్లు చిన్నబోయిందే. ఈ రోజు సొరకాయ పాలుపోసి వండాను. నువ్వే గుర్తొచ్చావ్. ఇంట్లో వుంటే పేచీలు పెడ్తూ మీ అమ్మతో పోట్లాడ్తావు కానీ నువ్వెళ్ళాక మీ అమ్మ నీకు ఇష్టమైన టిఫిన్లు చెయ్యడం కూడా మానేసింది. 'మా రుషి వచ్చాక చేస్తాను' అని" అంది.

"మీ ముగ్గురు పిచ్చోళ్ళూ నేను లేకుండా ఎలా వుంటున్నారో అని నాకూ బెంగగానే వుంది."

ఆ తర్వాత పక్కింటి పంకజాక్షి ఆంటీ అరటి పండు తొక్కమీద కాలు వేసి పడితే ఆరునెలలు బెడ్ రెస్ట్ అన్నారనీ, పనిచేసే పుష్ప నాలుగోసారి ప్రెగ్నెంట్ అయి పని మానేసిందనీ, ఎదురింటి వాళ్ళ అమ్మాయి ఎవరో ఆంగ్లో ఇండియన్

అబ్బాయితో ఇంట్లోంచి పారిపోయిందనీ నాకు అమ్మ ఫ్రెండ్ యశోదా ఆంటి ఏదో సంబంధం చెప్పిందని గిన్నెలో అన్ని కూరలూ కలగలిపి సాంబారు పెట్టినట్లు బోలెడు కబుర్లు చెప్పి, చివర్న 'ఎప్పుడొస్తున్నావే?'" అంది నానమ్మ.

నానమ్మ అలా అనగానే, టికెట్ ప్రీపోన్ చేసుకుని రేపే వెళ్ళిపోవాలి అనిపించింది.

"పెద్దముండాదాన్ని ఎన్నాళ్ళుంటానో తెలీదు. మీ అత్తయ్య మావయ్యలని కూడా పరిని తీసుకుని ఓసారి వచ్చి చూసెళ్లమను. ఉండనా?" అని ఫోన్ పెట్టేసింది.

ముసలాళ్ళు అయ్యాక పోవలసిందే ఏదో ఒకరోజు. అసలు ఇళ్ళల్లో డ్రాయింగ్ రూములో సోఫాలూ, గ్రాం ఫోన్ రికార్డ్లూ, బెడ్‌రూములలో మహాగనీ టేబుల్స్‌లా వంట గదుల్లో వాసిన కట్టిన ఊరగాయ జాడీల్లా నానమ్మలూ తాతయ్యలూ, అమ్మమ్మలూ లేకపోతే అది ఇల్లెలా అవుతుందీ?

"నానమ్మా !నాన్న లెక్క చెయ్యలేదని కోప్పడ్డారు. నానమ్మా! అమ్మ నూనె ఒలకబోసానని కొట్టింది." అంటూ వచ్చి మంచం మీద ఎవరి వీపు వెనకాల దాక్కుంటాం? అసలు మనం పలకమీద ఏ సీ డీ బీ  అని రాసినప్పటినుండీ డిగ్రీ, అత్తెసరు మార్కులతో పాస్ అయ్యేవరకూ అది నా మనవరాలురా దానికి అన్నీ నా పోలికలే. అది సాధించలేనిది లేదు" అన్న ఝూటర్ ఢమాల్ సర్టిఫికెట్లు నానమ్మలు గాక ఇంకెవరిస్తారు చెప్పండి. నానమ్మ గుర్తు రాగానే నాకు పెరుగన్నంలో నిమ్మకాయ ముక్క వేసుకుని తిన్నట్లు మనసంతా ఆనందంగా మారిపోయింది. తిరుగు ప్రయాణానికి రెక్కలు అల్లార్చుకోసాగాను. ఎంత దూరం ఎగిరినా పక్షులు గూళ్ళకి చేరుకోవలసిందేగా!

"అప్పుడే ఇంటి మీదకి ధ్యాస మళ్ళిందా? ఇంకా నీ టికెట్ ఎక్స్‌టెండ్ చేయిద్దాం అనుకున్నామే" అంది అత్తయ్య.

"నానమ్మ చెప్పింది, ఇంట్లో ప్రశాంతంగా వుంటే, ఎవరికీ అన్నం అరగక వండుకోవట్లేదుట" అన్నాను.

మావయ్య పైనాపిల్ కోస్తూ "మరి మా పరిస్థితీ అంతేకదమ్మా నువ్వు లేకపోతే" అన్నాడు.

"వస్తుంటాలే మావయ్యా" అన్నాను.

"ద్వారక ఏమంటున్నాడూ? పెళ్ళికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడా? వాళ్ళ పెద్దవాళ్ళని మేమేమయినా కలిసి మాట్లాడాలంటే చెప్పు" అన్నాడు మావయ్య.

"అవును రుషీ! ఏం చేస్తారు ఆ పిల్లాడి తల్లితండ్రులు?" అంది అత్తయ్య.

"తండ్రి ఇండియాలోనే ఉంటారుట. తల్లి రిటయిర్డ్ ప్రొఫెసర్ సైకాలజీలో. ఓ ఏక్సిడెంట్ వల్ల బెడ్‌రిడెన్ అయ్యారు పాపం. మేమిద్దరం మంచి ఫ్రెండ్సే కానీ, పెళ్ళిదాకా టాపిక్ రాలేదు" అని అబద్ధం ఆడాను.

ఎంత ఫార్వర్డ్ అయినా, ఇంకా పెళ్ళికాకుండానే ఒక అబ్బాయితో కలిసి వుంటాను అని చెప్పలేకపోయాను.

"మీరు మాట్లాడుకోకపోయినా, మేం మాట్లాడుతాం. అందుకేగా మేం వున్నాం" అన్నాడు మావయ్య.

"ఆ అవసరం వస్తే చెప్తాను. ఇంకా నేను ఆలోచించుకోలేదు మావయ్యా" అన్నారు.

"చూడమ్మా ఈ ఇంట్లో ఈ ఏడు సన్నాయి మోగుతుంది అనుకున్నాం. మా నుదుటున అది రాసి పెట్టిలేదు. కనీసం నీ పెళ్ళి అయినా ముచ్చటగా జరిగితే ఆనందిస్తాం" అన్నాడు.

నేను క్షతగాత్రులయిన వాళ్ళమీద ఇంకో అస్త్రం సంధించలేకపోయా.

నిన్నా నేడూ కీ మధ్య సంధిలా వుంది నా పరిస్థితి.

ప్రయాణానికి సూట్‌కేస్ సర్దుకుంటున్నాను. నేను ఒక్కొక్క బట్టా మడత పెట్టి అందులో పెడుతుంటే, అత్తయ్యకీ మావయ్యకీ భరించలేనంత బరువుగా ఫీల్ అవుతున్నారు.

రాత్రి యధాప్రకారం ద్వారక ఫోన్ చేసాడు.

"అమ్మని చూడవా?" అడిగాడు.

దేవకిగారు గుర్తొచ్చారు. ఆవిడకి నన్ను చూడగానే మొహంలో ఎంతో వెలుగొచ్చింది. వయసులో వున్న మగ పిల్లల తల్లులు, ఆ ఈడు ఆడపిల్లలు కనిపిస్తే చాలా ఉత్సాహంగా మాట్లాడ్తారు. మన కోడలు అయితే బావుండు అని. బహుశా మన హిందూ ధర్మ శాస్త్రాన్ని అనుసరించి వంశం నిలవాలంటే కోడలు దొరకాలనే తపన కావచ్చు. ఎలాగైతే పుత్రుడుంటే పున్నామ నరకం దాటుతాం అనే నమ్మకం వుంటుందో అలా అన్నమాట.

దేవకి గారికి నన్ను చూడగానే చాలా సంతోషం కలిగింది అని ఆవిడ నా చేతులని పట్టుకుని నిమిరిన తీరు చెప్పింది. ద్వారక బయటకి వెళ్ళినప్పుడు ఆవిడ నాతో "రుషీ మా వాడు నచ్చాడా? వాడికీ నువ్వు బాగా నచ్చినట్లున్నావ్. వెళ్ళాక పెద్దవాళ్ళతో మాట్లాడ్తావా?" అని అడిగారు.

నేను సందిగ్ధంలో పడ్డాను. నచ్చలేదనీ చెప్పలేను. చాలా నచ్చాడు కానీ అతనికి పెళ్ళి ఇష్టంలేదనీ అంటే నేరాలు చెప్పినట్లు అవుతుంది. నేనింకా ఆలోచించుకోవాలి అంటే అదీ యదార్ధం కాదు. నెగిటివ్‌గా వెళ్తుంది.

"ద్వారకకి వివాహ వ్యవస్థ మీద నమ్మకం లేదు ఆంటీ" అన్నాను.

ఆవిడ నిట్టూర్చింది. "నన్నూ వాళ్ల నాన్ననీ చూసాక ఈ వ్యవస్థ మీద నమ్మకం పోయి వుంటుందమ్మా. తప్పంతా నాదే" అందావిడ.

గాలి ఇలా వచ్చి, నెపం ఆవిడ మీద వేసుకుంటారని ఊహించలేదు నేను.

"అదీ పూర్తిగా అయివుండదు. తన స్నేహితుల్లో కూడా ఒకరిద్దరు నాలుగేళ్ళూ, ఐదేళ్ళూ ప్రేమించుకుని పెళ్ళాడి, నాలుగు నెలలైనా భార్యాభర్తలుగా ఒక రూఫ్ కింద ఇమడలేకపోయారని అన్నాడు" అన్నాను.

"ఇదీ, అదీ అన్నీనూ. ఎవడికో షాక్ కొట్టిపోతే మనం కరెంట్ సాధనాలు వాడడం మానేస్తామా?" అందావిడ.

ఎంబ్రాయిడరీ పూలు కుట్టిన నా కుర్తీ, గాలికి అద్దాలు కుట్టిన చున్నీ ఎగరడం ఆవిడ ప్రేమగా చూసారు.

"ఇంట్లో ఆడపిల్ల మెసలడం ఒక అందం. నాకు నీలాంటి కోడలు వస్తే బావుంటుంది" అన్నారు.

ఆవిడ అర్థింపుగా ఆ మాటలు అంటుంటే, నా మనసంతా ఒక రకంగా తడి తడిగా మారింది. యాషిక వుంటే 'మనసు తడిగా మారడం ఆర్టరీస్.. వెంట్రికల్స్ తడిగా వుండడం నీకెలా తెలుస్తయే?' అనేది.

కవులకీ పిచ్చివాళ్ళకీ తెలుస్తుంది.

అదే ఆర్ద్రత అంటే.. ఆర్ద్రత అంటే? శంకరాభరణం సినిమా పెడితే, అందులో కొంచెం చాదస్తంగా కనిపించే పిలక పెట్టుకున్న సోమయాజులుగారు చెప్తారు. కరుణ రసం అంటే, టమోటాలూ, కొత్తిమీరా, మిరియాల పొడీ వేసి పెట్టే రసం కాదు. ఎవరైనా కష్టాల్లో వుంటేనో, బాధలో వుంటేనో, మనసులో వూరే చెమ్మ!

చెమ్మ అంటే వర్షాకాలం రూఫ్‌లోంచి వర్షపు నీరు కిందకి కారి, గోడలమీద మనదేశపు పటం ఆకారంలో 'మేప్'లు రావడంకాదు. అది ఓ స్పందన.

స్పందన అంటే నా భుజం మీద ద్వారక చెయ్యి పడగానే, గుండెల్లో కలిగిన 'ఝుల్లు'మన్న భావం.. 'ఝుల్లు ' అంటే, గుండె ఎవరో నొక్కి అంతలోనే వదిలేసిన భావన. అది మధురంగా వుంటే అతన్ని ప్రేమించినట్లు దుర్భరంగా వుంటే అసహ్యించుకుంటున్నట్లు

అతని స్పర్శ ఎంతో బావుంది. ద్వారకవైపు నేను అనురక్తిగా చూసాను. అంటే ప్రేమా, కోరికా కలిపి, నేను ఖచ్చితంగా రచయిత్రిని కాగలను. యాషిక అన్నది నిజం.

నా భుజం మీద తన చేతిని నొక్కుతూ ద్వారక "భోజనం రెడీ ఏంజెల్" అన్నాడు.

"అప్పుడే రెడీ చేసావా?" ఆశ్చర్యపోయాను.

"ద్వారక వంట చాలా బాగా చేస్తాడమ్మా" అన్నారు ఆంటీ.

"నన్ను ఎలాగైనా సేల్ చెయ్యాలని చూడకు మమ్మీ" అన్నాడు ద్వారక.

నిజంగానే అతను ఇంత షార్ట్ టైములో బెండకాయ ఫ్రై, కొబ్బరి చట్నీ, టమాటా రసం, అప్పడాలు... అన్నీ చెయ్యడం అద్భుతం అనిపించింది.

దేవకిగారిని కూడా వీల్ చెయిర్‌తో సహా తీసుకొచ్చి, కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేసాం.

ఆవిడని గదిలో బెడ్ మీదకి చేర్చి, 'బై' చెప్తుంటే, "మళ్ళీ మళ్ళీ వస్తావుగా" అన్నారావిడ.

"వస్తా" అన్నాను.

ఇంటి వసారాలో తోట కనిపించేట్లు రెండు పేము కుర్చీలు వేసాడు ద్వారక. ఫ్రూట్స్ అందంగా కట్ చేసి పెట్టిన బౌల్స్ వున్నాయి వాటి మధ్యలో వున్న టీపాయ్ మీద.

నేను అతనికి ఎదురుగా కూర్చున్నాను. రివ్వున గాలి చెంపకి తగుల్తోంది. ఆ రోజు వానలేదు. చెర్రీ బ్లోజం వృక్షాలు గాలికి తలలూపినప్పుడల్లా, పసి పాపాయి నవ్వుల్లా ఆకాశంలో తారల్లా పూలు నేల రాలుతున్నాయి. ఆ గాలీ, సువాసనా, ఎంతో ఆహ్లాదంగా వుంది.

స్నానం చేసి, పలుచని లాల్చీ వేసుకుని కూర్చుని వున్న ద్వారక సుమనోహరంగా వున్నాడు. పాలమీగడతో పోటీ పడే అతని దేహంలో కలిసిపోయినట్లుంది ఆ కుర్తా.

"ఏంటలా చూస్తున్నావ్?" ఒక చెర్రీ నా నోటికి అందిస్తూ అడిగాడు.

అతని పెదవులు కూడా చెర్రీల్లా తోచాయి. అతను ఇంత దూరంగా కూర్చున్నాడేం? కొంచెం ముందుకి జరిగి నా తలని రెండు చేతుల మధ్యనా పట్టుకుని, గాఢంగా ముద్దు పెట్టుకోడేం? అనిపించింది.

ఎందుకీ ముసుగులో గుద్దులాట. ఏకాంతం వుంది. కోరిన చెలికాడున్నాడు. తనువులో తాపం వుంది. ఇంకా బింకం ఎందుకు?" కమాన్ లెట్స్ హేవ్ రొమాన్స్" అననా? ఎందుకీ బెరుకు.. జంకు.. ఈ రెండింటికీ కలిపి కామన్‌గా సిగ్గు అనే పేరు వుందా? సిగ్గుపడి ఈ అవకాశాన్ని జారవిడుచుకుంటున్నానా?

COMMENTS